క్లుప్తంగా

మాలకొండ ఆలయ ఆదాయం రూ.16,30,248

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి శనివారం రూ.16,30,248 ఆదాయం వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఆదాయంలో భాగంగా తలనీలాలు రూ.60,925,ప్రత్యేకదర్శనానికిరూ.5,52,900, లడ్డు ప్రసాదం రూ.2,80,960, అన్నదానానికి రూ.6,26,957,వివిధరూపాల్లో రూ.1,08,506 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అరుణ



సీఎం చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న అరుణ

కొండపి: రాష్ట్రంలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా కొండపి గురుకుల పాఠశాల కు చెందిన అరుణ ఎంపికయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలో ఉన్న 190 గురుకుల పాఠశాలలో కొండపి గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేసిన సందర్భంగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు, ప్రశాంశాపత్రాన్ని అందుకున్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించండి



మాట్లాడుతున్న ఏడీఏ జైలాబ్దిన్

కనిగిరిరూరల్: రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు, అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులను పొందాలని ఏడీఏ ఎస్‌కే జైలాబ్దిన్ అన్నారు. మండలంలోని బడుగులేరు, యడవల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఆత్మా సౌజన్యంతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటి సాగు చేస్తున్న పంటల్లో సమగ్ర పురుగుల యాజమాన్యం గురించి వివరించారు. సర్పంచ్ బుడే సాహెబ్, వీఏఏ బి నర్మదా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సామూహిక కుంకుమ పూజ



కోదండ రామస్వామి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మర్రిపూడి: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని స్థానిక పడమటి బజారులోని కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గ్రామస్తుల సహకారంతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా అర్చకులు గంధ్రకోట శ్రీనివాసశర్మ సీతాస మేత రామలక్ష్మణులను పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజ చేశారు. మహిళలు తలంటు స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి ఆలయానికి చేరుకుని సీతమ్మ తల్లికి సామూహికంగా పసుపు, కుంకుమలతో అర్చన చేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రంగబాబు

కనిగిరిరూరల్: మండలంలోని దిరిశవంచ గ్రామంలో అనారోగ్యంతో ఉన్న బత్తుల బాలయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం యడవల్లి ఎంపీటీసీ కుమారుడు, ఏపీ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అసోసియేషన్ సభ్యుడు వట్టి వేళ్ల రంగబాబు రూ.5 వేలు ఆర్థికసాయం అందచేశారు. ఈ సందర్భంగా రంగబాబు మాట్లాడుతూ పేదలకు తన వంతు సాయం ఎల్లప్పుడు అందచేస్తానని చెప్పారు. దేవాంగ సంక్షేమ సంఘ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

సీఎస్‌పురం(పామూరు): ఒంగోలులో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కేవై. పెదమస్తాన్ అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం వారు సీపీఐ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. మహాసభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శులు జి.నరసింహులు, ఎస్‌కే.మౌలాలి, బి.రమేష్, నారాయణ, గోవిందు పాల్గొన్నారు.

ఆధిపత్య పోరుతో..
అర్ధంతరంగా నిలిచి..

- నిలిచిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయంపై పట్టు కోసం అధికార పార్టీ నేతల మధ్య పోరు
- నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారంటూ కోర్టులో దివి వర్గం పిటిషన్
- కోర్టు కేసుతో నెల రోజులుగా నిలిచిపోయిన నిర్మాణాలు
- లక్షల ఖర్చు చేసి నిండా మునిగామంటూ వ్యాపారుల ఆవేదన



అంకమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో నిలిచిపోయిన నిర్మాణాలు

కందుకూరు:

గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అధికార పార్టీ రాజకీయాలకు వేదికగా మారింది. ఆలయ అభివృద్ధిని కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వర్గం, నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుందంటూ దివి వర్గం వర్గ పోరుకు దిగడంతో లబ్దిదారులు నిండా మునిగారు. ఈ నేపథ్యంలో వివాదం కోర్టుకెక్కడంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. దీంతో వేలంపాటలో షాపులు దక్కించుకున్న వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పట్టణ నడిబొడ్డున ఉన్న గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ఇటీవల దేవాదాశాఖ అధికారులు చేపట్టారు. అంతకు ముందే ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల కేటాయింపుకు సంబంధించి వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో దాదాపు 24 మంది వ్యాపారులు రూమ్‌లను దక్కించుకున్నారు. దీని ప్రకారం పాడుకున్న వ్యాపారులు రూమ్‌లు నిర్మించుకుని కొన్నేళ్ల పాటు వ్యాపారం చేసుకునే హక్కును కల్పించారు. ఆ మేరకు దేవాదాయశాఖకు రూ 2.25లక్షలను చొప్పున చెల్లించారు. ఆ తరువాత రూమ్‌లు వ్యాపారులే నిర్మించుకుని నిర్వహించుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు నెల క్రితం రూమ్‌లు నిర్మాణాలు ప్రారంభించారు. దాదాపు నిర్మాణాలు శ్లాబ్ లెవల్‌కు వచ్చాయి. కానీ ఇక్కడే అసలు కథ ప్రారంభమైంది.

మొదటి నుంచి షాపుల నిర్మాణాలను వ్యతిరేకిస్తున్న గ్రామదేవత వారసత్వ ధర్మకర్తగా చప్పుకుంటున్న దివి లింగయ్యనాయుడు మరికొందరితో కలిసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుందంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ నిర్మాణాలపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. దీంతో గత నెల రోజులుగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రస్తుతం హైకోర్టు కేసు ఇంకా విచారణ దశలోనే ఉంది. దీంతో ప్రస్తుతం ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఏమౌతుందోనని చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి వేలంపాట ద్వారా షాపులను దక్కించుకున్న వారు ఇప్పటికే దాదాపు రూ.4లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ పరిస్థితుల్లో నిర్మాణాలు నిలిచిపోతే తమ పరిస్థితి ఏంటి అంటూ సదరు వ్యాపారులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. అటు డబ్బులకు డబ్బులు పోయి ఇటు వ్యాపారం చేసుకునే అవకాశం లేక రెండు విధాల నష్టపోయామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం అధికార పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగానే జరిగిందని, ఆలయంపై పెత్తనం కోసం జరుగుతున్న పోరులో తమను బలిపశువులను చేస్తున్నారంటూ విమర్శిస్తున్నారు. దేవదాయశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చలో కరేడుకి అనుమతి లేదు

కందుకూరు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన చేపడుతున్న చలో కరేడు కార్యక్రమానికి పోలీస్‌శాఖకు ఎటువంటి ముందస్తు సమాచారం లేదని, చలో కరేడు కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమం పేరుతో బయట వ్యక్తులు కరేడు గ్రామానికి వచ్చి గ్రామస్తులకు లేనిపోని అపోహలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని, ఇటువంటి వ్యక్తుల నుంచి తమకు రక్షణ కల్పించాల్సిందిగా కరేడు గ్రామస్తుల నుంచి పోలీసులకు ఫిర్యాదులొచ్చాయన్నారు. ఇండోసోల్ కంపెనీకి భూములు కేటాయింపును వ్యతిరేకిస్తూ ఇప్పటికే ధర్నాలు, రాస్తోరోకోలు, జాతీయ రహదారి దిగ్బంధనం వంటి కార్యక్రమాలు నిర్వహించిన వారిపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారిపై దాడి చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేశామన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కరేడు ప్రాంతంలో ఈనెల ఒకటవ తేదీ నుంచి 30 పోలీస్ యాక్టు, 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. కావున కరేడులో అవాంఛనీయ సంఘటనలు నివారించడానికి ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా కార్యక్రమాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కావున కరేడు గ్రామానికి సంబంధం లేని బయట వ్యక్తులు గ్రామంలోకి వచ్చి గ్రామస్తులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ అన్వర్‌బాష, ఉలవపాడు ఎస్సై అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

బార్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు: నూతన బార్‌ల విధానం ప్రకారం 2025–28 కాలానికి సంబంధించి కందుకూరు ఎక్సైజ్‌శాఖ పరిధిలోని బార్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ప్రస్తుత బార్ యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. కందుకూరు ఎక్సైజ్‌శాఖ పరిధిలో మూడు బార్‌ల ఏర్పాటుకు లైసెన్స్‌లను మంజూరు చేశామన్నారు. దీనికి గాను ఏడాదికి రూ. 55 లక్షల లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, ఈ మొత్తాన్ని ఆరు విడతలుగా చెల్లించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. బార్‌లు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12గంటల వరకు కూడా పనిచేసేందుకు అవకాశం కల్పించారని, కావున నూతన బార్‌ల లైసెన్స్‌ల కోసం ఆశావాహులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు ఫీజు కింద రూ.5లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, ఒక బార్ పరిధిలో 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి లైసెన్స్ కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆశావాహులకు ఆయన సూచించారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

మహాసభలను జయప్రదం చేయండి

కొండపి: ఐద్వా జిల్లా 13వ మహాసభలను జయప్రదం చేయాలని విరాళాలు సేకరిస్తూ, ఇంటింటి ప్రచారం చేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. కొండపిలో వివిధ ప్రాంతాల్లో శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో జిల్లా మహాసభలు కొండపిలో జరుగుతున్నాయని, మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. నిత్యం మహిళలపై చిన్నారులపై లైంగిక దాడులు పెరుగుతూనే ఉన్నాయని, వాటిని అరికట్టేందుకు పాలకులు చిత్తశుద్ధితో ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. పార్లమెంట్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినా నేటికీ అమల్లోకి రాలేదన్నారు. మహిళా సమానత్వాన్ని కోరుకునే ప్రజాతంత్రవాదులంతా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. ఐద్వా మండల కార్యదర్శి విశ్రాంత, ఆదాం, నిర్మల, సుకన్య, సుభాషిణి, అంజమ్మ, నిర్మల, జ్యోతి, కోమలి పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

టంగుటూరు: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీ చేశారు. ఈ సంఘటన శుక్రువారం రాత్రి స్థానిక విష్ణాలయం వీధిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు..విష్ణాలయం వీధిలో నివాసం ఉండే కనపర్తి శేషమ్మ శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్ పనిచేయడం లేదని, దగ్గర్లో ఉన్న బంధువుల ఇంటికెళ్లి నిద్రపోయి తిరిగి మరుసటి రోజు ఉదయం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై వస్తువులు చల్లాచెదురుగా పడి ఉన్నాయి. రూ.50 వేల విలువైన రెండు బంగారు తాళిబొట్లు, రెండు లక్ష్మీ రూపులు, రూ.12,500 నగదు దొంగలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సింగరాయకొండ గీతామందిరంలో రాధాకృష్ణులను తులసితో పూజలు



జమ్ములపాలెంలో పూజలందుకుంటున్న రాధాకృష్ణమూర్తులు



బాబా గుడిలో శ్రీ కృష్ణునికి పూజలు

సింగరాయకొండ: మండలంలోని ఆలయాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని గీతా మందిరంలో రాధాకృష్ణుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి తులసితో పూజలు చేసి పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహాస్వామి దేవస్థానం, రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామస్వామి దేవస్థానంలో ఉట్టి కార్యక్రమం నిర్వహించారు.

కొండపి: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని కట్టవారిపాలెంలో పోలేరమ్మ దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలను కట్టవారిపాలెం యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సాహంగా జరిగిన ఉట్టి కొట్టుడు పోటీల్లో చిన్నారులు యువత ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టారు. అనంతరం అన్నదానం చేశారు. ఉట్టి కొట్టే పోటీల్లో గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులను కమిటీ వారు అందజేశారు.

పొన్నలూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొన్ని గ్రామాలు చిన్నారులు వేసిన గోపిక, శ్రీకృష్ణుల వేషధారణలు అలరించారు. చిన్నారులు, యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పొన్నలూరు వినాయక్ నగర్‌లో యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు శ్రీకృష్ణుడికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టంగుటూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భముగా జమ్ములపాలెంలో అర్చకులు రాధాకృష్ణులకు రుత్వికులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని గోమాతను పూజించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం వేళ ఉట్టి కార్యక్రమంలో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు.

పామూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మదన వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణి, సత్యభామా సమేత శ్రీ మదన వేణుగోపాలస్వామి మూలవిగ్రహమూర్తికి, పంచలోహ ఉత్సవమూర్తులకు అర్చకులు నారాయణం సత్యబాబుస్వామి అభిషేకం నిర్వహించి అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్ర సమయంలో ఆలయంవద్ద వేడుకగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించగా రుక్మిణి, సత్యభామాసమేత మదనవేణుగోపాలస్వామి పంచలోహ విగ్రహమూర్తులకు ఆలయ ఉత్సవం మేళతాళాల నడుమ ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో చిన్నారుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కనిగిరిరూరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను కనిగిరిలో వైభవంగా నిర్వహించారు. పట్టణంతో పాటు, వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సాయిబాబా దేవస్థానంలో శ్రీకృష్ణ భగవానుడికి వేద పండితులు అష్టోత్తర శత నామావళి పూజలు నిర్వహించారు. చిన్నారులు, శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలతో అలరించారు. ఈ సందర్భంగా భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణంలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ భగవానుడి గీతాలు ఆలపించారు. శ్రీ కృష్ణుడు, గోపికల వేషాధారణలో ఆలరించిన చిన్నారులకు, కోలాట ప్రదర్శించిన మహిళలకు బాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, కమిటీ గౌరవాధ్యక్షుడు కుందురు తిరుపతిరెడ్డి, కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు, సింగరాజు మాలకొండేశ్వరావు, బాలు ఓబులరెడ్డి, సద్గురు సాయి సేవా సమితి అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం: స్థానిక గోపాల్‌నగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు శ్రీకృష్ణుడు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. మట్లే వేణుగోపాల్, పెన్నా రమణయ్య, కె.వీరప్రసాద్, ఆవుల కొండలరావు, గంగాడి మహేంద్ర, గోగుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉలవపాడు: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేణుగోపాల స్వామి దేవస్థానం, కృష్ణుడి గుడి, కృష్ణనగర్ మెయిన్‌రోడ్, కరేడులోని శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రత్యేక పూజలు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు శ్రీకృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో అలంకరించారు. ఉలవపాడులో ప్రత్యేక అలంకరణతో శ్రీకృష్ణునికి గ్రామోత్సవం కనులపండువగా సాగింది. కృష్ణనగర్‌లో ఉట్టి కొట్టారు.



బాబా ఆయలంలో కృష్ణాష్టమి పూజలు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



పామూరులో ఉట్టికొడుతున్న యువకులు



కొండపిలో ఉట్టిని కొడుతున్న చిన్నారి

ఉత్తమ సేవలకు అవార్డులు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలువురు అధికారులకు ఉత్తమ అవార్డులు దక్కాయి. ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి డీబీవీ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ తదితరుల చేతుల మీదుగా అధికారులు ప్రశంస పత్రాలు అందుకున్నారు.

సాక్షి నెట్‌వర్క్:



ప్రశంస పత్రాలు తీసుకుంటున్న సర్పంచ్ తాతపుడి సురేష్ , బడుగులేరు వీఏఏ నర్మద , సీఐ ఎస్‌కే ఖాజావలి, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ఈఓ నరసింహబాబు, రేగులచలక వీఆర్‌ఓ షరీఫ్



కానిస్టేబుల్ సిద్దయ్య(పామూరు), కానిస్టేబుల్ బాలమురళి(పామూరు),వీఓఏ గంగాదేవి(పామూరు) ,కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్, అనిల్, కానిస్టేబుల్(కొండపి)



పామూరు ఎస్సై కిషోర్‌బాబు,అజయ్‌కుమార్ (సీనియర్ అసిస్టెంట్, పామూరు) , పీసీపల్లి తహసీల్దార్ ఉష ,పీసీపల్లి ఎస్సై కోటయ్య, పొన్నలూరు గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవరావు, కారుమంచి సర్పంచ్ మన్నం శ్రీనివాస్